ప్రభుత్వ దవాఖానల్లో కాన్పుల సంఖ్య పెంచాలి: డిప్యూటీ డీఎంహెచ్‌వో

మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయ నిర్మల

రామాయంపేట, మే 20: ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయ నిర్మల అన్నారు. సోమవారం రామాయంపేట ప్రభుత్వ దవాఖానను సందర్శించి రికార్డులు తనిఖీచేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్యను పెంచేలా వైద్యులకు సూచించారు. రోజూ జరిగే ఓపీల సంఖ్యను కూడా పెంచాలన్నారు. దవాఖానల్లో అన్ని రకాల వైద్యం అందిస్తున్నామన్నారు. సమావేశంలో సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ లింబాద్రి. డి.ధర్మారం వైద్యురాలు హరిప్రియ తదితరులు ఉన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ

తూప్రాన్, మే 20: పచ్చిరొట్ట ఎరువులు, జీలుగ విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈవో గంగమల్లు తెలిపారు. సోమవారం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద సబ్సిడీ విత్తనాల పంపిణీ ప్రారంభించారు. తూప్రాన్ మండలానికి మొత్తం 473 జీలుగ బస్తాలు వచ్చాయని, బస్తా ధర రూ.2790 ఉండగా, సబ్సిడీ పోను రూ.1,116 చెల్లిస్తే సరిపోతుందన్నారు.

చాకరిమెట్లలో మాన్యసూక్త అభిషేకం

శివ్వంపేట, మే 20: మండలంలోని చిన్నగొట్టుముక్ల పంచాయతీలో ఉన్న చాకరిమెట్ల శ్రీసహకార ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం మాన్యసూక్త అభిషేకం చేశారు. హనుమత్ దీక్షాపరుడు దుర్గాప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో అష్టోత్తర ఘటాభిషేకం, మాన్య సూక్త అభిషేకం నిర్వహించారు. అనంతరం ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో ప్రధాన పూజారి దేవదత్త శర్మ, ప్రభు రాజశర్మ తీర్థప్రసాదాలు అందజేశారు.

ఏడుపాయల హుండీ ఆదాయం రూ.47.50 లక్షలు

పాపన్నపేట, మే 20: ఏడుపాయల వనదుర్గా భవానీ మాత ఆలయ హుండీ ఆదాయం రూ.47,50,681 వచ్చినట్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. 70 రోజుల తర్వాత సోమవారం హుండీని రాజరాజేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో గోకుల్ షెడ్‌లో లెక్కించారు. మిశ్రమ బంగారం, వెండి కానుకలతోపాటు ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రంగారావు, మండలి సభ్యులు వెంకటేశం, మనోహర్, చక్రపాణి, మోహన్‌రావు, పెంటయ్య, నాగభూషణం, రఘు, యాదయ్య, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మనోహరాబాద్, మే 20: అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెందిన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలాట గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్సై కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని పాలాట గ్రామానికి చెందిన మంచి నాగరాజు(28) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 6న మేడ్చల్‌లోని సీఎంఆర్ దవాఖానకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని డాక్టర్లు సూచించారు. కూలి పనులు చేసుకునే నాగరాజు కుటుంబ సభ్యుల వద్ద డబ్బులేకపోవడంతో ఈనెల 18న ఇంటికి వచ్చారు. తన వల్ల కుటుంబ సభ్యులు బాధపడడం చూసిన నాగరాజు ఆదివారం రాత్రి తన బెడ్‌రూంలో ఉరేసుకున్నాడు. ఇది గమనించిన అతడి భార్య రజిత వెంటనే మామలైన మంచి శ్రీను, మంచి బాబులను పిలిచింది. వారు వచ్చి నాగరాజును కిందికి దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి

పాపన్నపేట, మే20: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్నాయని, ఇంకా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు రాశులు ఎక్కడికక్కడే ఉన్నాయన్నారు. ఈ పాటికే రైతులు మళ్లీ పంట సాగు చేసేందుకు దుక్కులు దున్నేవారని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

పెట్రోల్ బంకు నిర్వాహకుల నిర్లక్ష్యం

- ట్రాక్టర్‌లో డీజిల్‌కు బదులుగా పెట్రోల్
- ఆందోళన వ్యక్తం చేసిన ట్రాక్టర్ యజమాని

చిన్నశంకరంపేట, మే 20: బంకు నిర్వాహకుల నిర్లక్ష్యంతో పెట్రోల్‌కు బదులుగా ట్రాక్టర్‌లో డీజిల్ పోసిన ఘటన మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలోని హెచ్‌పీ పెట్రోల్ బంకులో సోమవారం జరిగింది. ట్రాక్టర్ యజమాని రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకట్‌రావ్‌పల్లి గ్రామానికి చెందిన పెద్దంకి రాజు తన జాన్ డీర్ ట్రాక్టర్‌ను తీసుకుని గవ్వలపల్లి చౌరస్తాలోని హెచ్‌పీ పెట్రోల్ బంకుకు డీజిల్ కోసం వచ్చాడు. పంపు నిర్వాహకులకు రూ.960 డీజిల్ పోయాలని సిబ్బందికి తెలిపాడు. దీంతో ఆపరేటర్ ట్రాక్టర్‌లో డీజిల్‌కు బదులుగా పెట్రోల్ పోశాడు. దీన్ని గమనించిన ట్రాక్టర్ యజమాని రాజు డిజిల్‌కు బదులుగా పెట్రోల్ ఎందుకు పోశావని ప్రశ్నించాడు. దీంతో తన ట్రాక్టర్ ఇంజిన్ చెడిపోతుందని ఆందోళనకు దిగాడు. పెట్రోల్ బంకు నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించాడు. ట్రాక్టర్‌ను బాగు చేయించి ఇస్తామని బంకు నిర్వాహకులు హామీ ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రాజును సముదాయించి పంపించారు.

పెట్రోల్ బంకులో ఆందోళన వ్యక్తం చేస్తున్న ట్రాక్టర్ యజమాని

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

శివ్వంపేట: చిన్నగొట్టిముక్ల తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ కల్లూరి హరికృష్ణ

వెల్దుర్తి: మాసాయిపేటలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు

శివ్వంపేట మండలంలోని తిమ్మాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు నవీన్ గుప్తా

- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి: బీఆర్‌ఎస్

వెల్దుర్తి, మే 20: కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం తడిసి, మొలకెత్తుతున్నదని, ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనాలని బీఆర్‌ఎస్ మాసాయిపేట మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం రైతులతో కలిసి కొనుగోలు కేంద్రాల్లో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రోజుల తరబడి ధాన్యాన్ని కేంద్రాల వద్ద రాశులు పోసి తిరగాల్సి వస్తున్నదన్నారు. తూకం అయిన బస్తాలను రైస్‌మిల్లులకు తరలించడంలోనూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయన్నారు. నాయకులు పవన్, నర్సింలు ఉన్నారు.

శివ్వంపేటలో కొనుగోలు కేంద్రం పరిశీలన ..

శివంపేట, మే 20: మండలంలోని కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తున్నదని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. సోమవారం చిన్నగొట్టిముక్ల ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి, తడిసిన వడ్లను పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు అందుబాటులో లేకపోవడంతో ఫోన్ చేసి మండిపడ్డారు. సమస్యపై సివిల్ సప్లై డీఎంకు ఎప్పుడు ఫోన్ చేసినా మీ మండలంలోనే ఉన్నానని అబద్ధాలు చెబుతూ తప్పించుకుంటున్నాడని, పరిష్కారం దిశగా ఆలోచించి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఎంపీపీ వెంట ఎంపీటీసీ నువ్వుల దశరథ, మాజీ సర్పంచ్ బాలమణి నరేందర్, పాపారావు, నారాయణరావు, హర్యానాయక్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది

శివ్వంపేట, మే 20: ప్రతి గింజా కొనేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆ పార్టీ నాయకుడ పులిమామిడి నవీన్‌గుప్తా అన్నారు. తిమ్మాపూర్, చిన్నగొట్టుముక్ల గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. లారీలు సమకూర్చి ధాన్యం త్వరగా కొనేలా చూడాలన్నారు. ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ సీఈవో మధు ఉన్నారు.

కొనసాగుతున్న కుటుంబ సర్వే

- మెదక్ జిల్లా వ్యాప్తంగా 1076 కేంద్రాల్లో సర్వే
- సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మెదక్, మే 20 (నమస్తే తెలంగాణ): జిల్లావ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ టీచర్లు కుటుంబ సర్వే నిర్వహిస్తున్నారు. కేంద్రం ఒక చోట ఉంటే లబ్ధిదారుల ఇండ్లు ఇంకో చోట ఉండడంతో చిన్నారులకు పోషకాహారం, గర్భిణులు, బాలింతలకు సేవలందించడంలోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. లబ్ధిదారులు కేంద్రాన్ని చేరుకోవడానికి అవస్థలు పడాల్సి వస్తోంది. సమీపంలోని కేంద్రాన్ని వదిలి దూరంలో ఉన్న కేంద్రానికి కేటాయించడంతోనే ఇలాంటి పరిస్థితి తలెత్తింది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని పరిష్కారం దిశగా మార్పులు తీసుకొచ్చే ప్రయత్నమే ఈ సర్వే. మెదక్ జిల్లాలో 1076 కేంద్రాల్లోని ఇండ్లను పరిగణనలోకి తీసుకుని సర్వే చేస్తున్నారు.

పకడ్బందీగా సర్వే చేపడుతున్నాం

కుటుంబ సర్వే నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపడుతున్నాం. జిల్లాలోని ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ సిబ్బంది సర్వే చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ సక్రమంగా జరిగేందుకు, అక్రమ రిజిస్ట్రేషన్ల తొలిగింపు, మైగ్రేషన్ తదితర అంశాలను సర్వేలో చేపట్టనున్నారు. ఈ సర్వే లబ్ధిదారులకు ఉత్తమ సేవలు అందించేందుకు ఉపయోగపడుతుంది.

- బ్రహ్మాజీ, డిడబ్ల్యూవో మెదక్

నేరుగా ఆన్‌లైన్‌లో నమోదు

సర్వే ఆధారంగా వివరాలు సేకరించిన సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన రెండు రకాల యాప్‌లలో సర్వేను ఒకేసారి పొందుపరుస్తున్నారు. కేంద్రాన్ని ఆధారంగా చేసుకుని ఇంటి నంబర్, కాలనీ పేరు, చిన్నారులు, తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు, జనన, మరణాలు, ఇల్లు ప్రస్తుతం ఉన్న కేంద్రం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. సర్వే రెండు విధాలుగా ఉంది. ఒకటి రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి, మరొకటి కేంద్ర ప్రభుత్వానిది. సర్వే అనంతరం కేంద్రాలకు సంబంధించి ఇండ్ల సర్దుబాటు ప్రక్రియ చేపడుతారు. కేంద్రానికి దూరంగా ఉండే ఇండ్లను సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి బదిలీ చేస్తారు. ఒక కేంద్రానికి 250 ఇండ్ల నుంచి 300 ఇండ్లు ఉండేలా సర్దుబాటు చేయనున్నారు. దీంతో అన్ని విషయాలు వెంటనే తెలిసేలా చేయనున్నారు.

మెదక్ పట్టణంలో సర్వే నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

పంచాయతీలకు సొంత డబ్బు చెల్లించలేం

- ఎంపీడీవోకు వినతి పత్రం అందించిన పంచాయతీ కార్యదర్శులు

వినతి పత్రం ఇస్తున్న కార్యదర్శులు

నర్సాపూర్, మే 20: ప్రత్యేక అధికారుల పాలనలో చాలా ఇబ్బందులు వస్తున్నాయని, సొంత డబ్బులు చెల్లించి పనులు చేయిస్తున్నామని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఎంపీడీవో మధులతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ప్రత్యేక అధికారుల పాలనలో చేసే ప్రతి పనికి అయ్యే వ్యయాన్ని పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులు చెల్లించాల్సి వస్తున్నదన్నారు. ట్రాక్టర్ డీజిల్, శానిటేషన్, బోర్లు రిపేర్, పైపులైన్ లీకేజీలు, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి ఎద్దడికి సంబంధించిన పనులకు తమ నెలవారి జీతం నుంచి చెల్లిస్తున్నామన్నారు. తమ కుటుంబ అవసరాలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు మల్లేశం, తారాసింగ్, లక్ష్మణ్, రమేశ్, రవి, రఘువరణ్, వంశీ, చంద్రశేఖర్, లలిత, స్రవంతి, ఊహ, శృతిజ పాల్గొన్నారు.

సీపీఆర్‌ను వేగవంతం చేయాలి

- మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోళికేరి
- కొనుగోలు కేంద్రాల సమస్యలపై కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం

మాట్లాడుతున్న మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతిహోళికేరి

మెదక్, మే 20 (నమస్తే తెలంగాణ): రైతులకు ఇబ్బందులేకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించి ఎగుమతి, దిగుమతి, మిల్లింగ్ స్టోరేజ్ కెపాసిటీ సమస్యలపై అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతిహోళికేరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సివిల్ సప్లయ్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల సమస్యలు, రవాణా ఇబ్బందులు, మిల్లర్స్ కెపాసిటీ, సీఎంఆర్ జిల్లాలో అమలు తీరుపై కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు రమాదేవి, శ్రీనివాస్, జయచంద్రారెడ్డి, శ్రీనివాసరావు, డీఏవో గోవింద్, డీసీవో కరుణ, పౌర సరఫరాల శాఖ అధికారులు, తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు అధిగమించి, సమయానికి రవాణా చేయాలన్నారు. జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎగుమతి చేసుకోవడానికి మిల్లింగ్ కెపాసిటీ సరిచూసుకోవాలని,లేనిపక్షంలో సిద్దిపేట, మహబూబ్‌నగర్ జిల్లాల మిల్లులకు ఎగుమతి చేయాలన్నారు. రైతులెవరూ అధైర్య పడవద్దని, పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు. ప్రస్తుతం 321 కొనుగోలు కేంద్రాల్లో రైతులు దగ్గర నుంచి ధాన్యం సేకరించినట్లు చెప్పారు. వర్షాల ప్రభావంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా రైతులకు చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం దిగుమతికి లారీల కొరత లేకుండా చూడాలని, ఎగుమతి చేసిన ధాన్యాన్ని పెండింగ్ లేకుండా దిగుమతి చేసుకుని రైతులకు భరోసా కల్పించాలన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను క్లియర్ చేయాలి: కలెక్టర్

పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల సమగ్ర నివేదికలు, ధరణి దరఖాస్తులు, ప్రజావాణి పెండింగ్ సమస్యలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఎగుమతి, దిగుమతి, నిల్వ సంబంధిత వివరాలపై సమగ్ర నివేదికలు తయారు చేయాలన్నారు. సమస్యలను జూన్ 7వ తేదీ లోగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీర్లను దర్శించుకున్న ఎమ్మెల్యే

మర్రిచెట్టు తండాలో పీర్లను దర్శించుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి, మే20: మండలంలోని మర్రిచెట్టు తండాలో ఎంపీపీ రాజు నాయక్ ఆధ్వర్యంలో పీర్ల జాతర నిర్వహిస్తున్నారు. సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పీర్లను దర్శించుకున్నారు. ఏటా గిరిజనులు పీర్ల వద్ద ప్రశాంత వాతావరణంలో పీర్ల జాతర జరిపి, మొక్కులు చెల్లించుకుంటారు. ఎంపీపీ రాజునాయక్ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఆమె వెంట జడ్పీటీసీ కవిత అమర్‌సింగ్, పార్టీ అధ్యక్షుడు రామాగౌడ్, నాగసాన్‌పల్లి మాజీ సర్పంచ్ ఎల్లం ఉన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే


వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కొల్చారం, మే20: కొల్చారం గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ పోతగల్ల పోచమ్మ బాలయ్య దంపతుల కూతురు వివాహం బాబా ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగింది. ఈ వివాహానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మాజీ ఉప సర్పంచ్‌లు మాజీ ఉపసర్పంచ్ చెన్నయ్య, వడ్ల ప్రభాకర్, సీహెచ్. రాములు, ఎండుగుల కృష్ణ ఉన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

నర్సింలును పరామర్శిస్తున్న.. బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

కొల్చారంలోని బాధితుల కుటుంబాలను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సోమవారం పరామర్శించారు. పీఏసీఎస్ చైర్మన్ నాగూరి మనోహర్, చౌగారి నర్సింలు, ఎండుగుల సత్యనారాయణ, మహమ్మద్ కుటుంబీకులను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సోమవారం పరామర్శించారు. మాజీ వార్డు మెంబర్ మహమ్మద్ భార్య బీబిబేగంకు రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేశారు. ఆమె వెంట పాండ్ర వెంకటేశం, నేరల్ల చంటయ్య, సీహెచ్.భాస్కర్, శేఖులు ఉన్నారు.

ప్రజావాణి సమస్యలను త్వరగా పరిష్కరించాలి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ బాలస్వామి


కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ

- ఎస్పీ డాక్టర్ బాలస్వామి

మెదక్ అర్బన్, మే 20: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ బాలస్వామి అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యక్రమంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు. హవేళీఘనపురం మండలం ఔరంగాబాద్ గ్రామానికి చెందిన చల్ల రాజు అనారోగ్యంతో ఉన్నాడు. రూ.5లక్షల బీమా డబ్బుల కోసం తనను చంపేస్తామని తన భార్య, చిన్న కుమారుడు హెచ్చరిస్తున్నారని, వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, చట్టపరమైన చర్య తీసుకుని న్యాయం చేయాలని ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదీకి తగిన న్యాయం చేయాలని హవేళీఘనపుర్ ఎస్సైకి ఎస్పీ సూచించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటాం

మెదక్ అర్బన్/తూప్రాన్, మే 20: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి పోలీస్ శాఖ తరపున అండగా ఉంటామని ఎస్పీ బాలస్వామి సోమవారం తెలిపారు. శివ్వంపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి గతేడాది మే 5న విధులు ముగించుకుని స్వగ్రామం ముప్పిరెడ్డిపల్లికి వెళ్తుండగా మార్గమధ్యలో పరికిబండ అర్ధరాత్రి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. వెంటనే హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్ అయ్యి మృతిచెందాడు. కానిస్టేబుల్ కుటుంబానికి ఎస్‌బీఐ నుంచి రావాల్సిన రూ.30 లక్షలు వారి కుటుంబ సభ్యులకు చెక్కు రూపంలో అందజేశారు. కానిస్టేబుల్‌కు రావాల్సిన శాఖ పరంగా రావాల్సిన అన్ని బెనిఫిట్స్‌ను అందజేస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

బెస్ట్ అవైలెబుల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, మే 20: జిల్లాలోని గిరిజన విద్యార్థులకు బెస్ట్ అవైలెబుల్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 25 ఖాళీలున్నాయని, అందులో 3వ తరగతిలో 13 సీట్లు, 5లో 6 సీట్లు, 8లో 6 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన విద్యార్థినులకు 33 శాతం రిజర్వేషన్ కేటాయించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సంగారెడ్డిలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్, సిద్దిపేటలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు ఫారాలు మెదక్ కలెక్టరేట్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలోని ఈనెల 21వ తేదీ నుంచి పొందాలన్నారు.

ఏలేటి రాజశేఖర్‌రెడ్డికి అవార్డు


అవార్డు అందుకుంటున్న రాజశేఖర్‌రెడ్డి

రామాయంపేట, మే 20: రామాయంపేటకు చెందిన లయన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డికి తెలంగాణ ప్రాంత లయన్స్ క్లబ్‌ల ఏరియా లీడర్ సునీల్‌కుమార్ సోమవారం బంగారు పతకం, ప్రశంసా పత్రం అందజేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ ప్రాంత లయన్స్ క్లబ్‌ల సమావేశంలో భాగంగా రాష్ట్రంలో ప్రతిభ చాటిన క్లబ్ సభ్యులకు బంగారు, వెండి, కాంస్య పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, మే 20: గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా అందించే ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో మాస్టర్స్, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టరేట్ రిసర్చ్ ప్రోగ్రాంలలో ఉన్నత విద్య అభ్యసించేందుకు ఎంపికైన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు. స్కాలర్‌షిప్ పొందాలనుకునే విద్యార్థులు ఈనెల 31వ తేదీలోగా http://overseas.tribal.gon.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో లేదా 8099609609, 8328572779 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అత్యధిక స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

చిన్నశంకరంపేట, మే 20: రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందడం ఖాయమని నాయకుడు ఏకే గంగాధర్‌రావు ధీమావ్యక్తం చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలుచేయడంలో విఫలమైందన్నారు. మెదక్ నుంచి వెంకట్రామిరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. ఆయన వెంట సింగిల్‌విండో మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర 161 చ॥గ॥ ఇంటి స్థలం అమ్మబడును. సంప్ర: 8143366630 / 9989554915. NT-5279

WANTED
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663. NT-327714-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657